సాక్షి
ఏలూరు
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



గుంతలతో దినదినగండం

చింతలపూడి, భీమడోలు ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా మారాయి. వర్షాలకు తీవ్రంగా **దెబ్బతిన్న రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది.** 8లో ▸



విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఉత్తీర్ణత సాధించినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. ఏలూరులో **శనివారం ఈ ఘటన జరిగింది.** 8లో ▸



గుట్టలు.. గుట్టుగా మాయం

పర్యావరణానికి, వన సంపదకు కేంద్రాలుగా ఉన్న గుట్టలను పట్టపగలే హరించేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి దర్శనార్థం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భవానీ దీక్షాధారులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

టెట్ పరీక్షకు 325 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ అర్హతను నిర్ధారించే టెట్‌–2024 పరీక్షలు నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో మూడో రోజైన శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన తొలి విడత పరీక్షలకు 185 మందికి గాను 159 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభమైన రెండో విడత పరీక్షలకు 185 మందికి గాను 166 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఇసుక పాలసీలో ఘోర వైఫల్యం

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆగ్రహం



కాకర్ల శ్రీను, కార్మికుల సంఘ నేత

దెందులూరు: ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం దెందులూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం, స్వార్థపూరిత ప్రణాళిక వల్ల భవన నిర్మాణ పనులకు సంబంధించి 16 అనుబంధ సంఘాల కార్మికులు పనుల్లేక అల్లాడుతున్నారని చెప్పారు. దీంతో వారి కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఇసుక విధానాన్ని పదేపదే తప్పుపట్టిన కూటమి ప్రభుత్వం పెద్దలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు.. ఇసుక కొరత విషయం తెలియదా అని ప్రశ్నించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రదర్శనలు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు నిర్వహించామని, అయినా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు.

సమర్థవంతంగా ధాన్యం సేకరణ : జేసీ



తేమ శాతం కొలిచే విధానాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతంగా ధాన్యం సేకరణ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి సిబ్బందికి కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా సిబ్బంది రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం సేకరించాలన్నారు. జిల్లాలోని 250 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. వీటిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా 76, రైతు సేవా కేంద్రాల ద్వారా 164, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా 45, రైతు ఉత్పత్తి కేంద్రాల ద్వారా 2 కలిపి మొత్తం 250 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా తేమశాతం కొలిచే విధానాన్ని పరిశీలించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




పెట్టుబడి సాయమేదీ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతన్నలకు ఏడాదికి రూ.20 వేల చొప్పున అందజేస్తాం.
– సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన సభల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీ ఇది.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలైంది. రైతు భరోసాపై ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు ఇప్పటివరకు దానిపై నోరు మెదపడం లేదు. ఇప్పటికే పీఎం కిసాన్ తొలి విడత సాయం అందించిన కేంద్రం.. శనివారం రెండో విడత సాయం విడుదల చేసింది. మరోపక్క అన్నదాత సుఖీభవ సాయంపై చంద్రబాబు స్పష్టతనివ్వడం లేదు. రెండో విడత కూడా వచ్చేసినా దీనిపై ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఇప్పటికే భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టాలు చవిచూసిన అన్నదాతలు ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా అందించకపోవడంతో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు.

- రెండో విడత సాయం విడుదల చేసిన కేంద్రం
- జిల్లాలో 1,35,230 మంది రైతులకు రూ.27.04 కోట్ల లబ్ధి
- రాష్ట్రం వాటాపై నోరెత్తని చంద్రబాబు ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల్లో హామీ
- ఖరీఫ్ మొదలై మూడు నెలలైనా ఆ ఊసెత్తని బాబు
- వరుస విపత్తులతో తొలకరి నష్టపోయిన రైతులు
- అన్నదాత సుఖీభవ సాయం కోసం ఎదురుచూపులు
- జగన్ ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా సాయం ఠంచనుగా పంపిణీ
- వైఎస్సార్‌సీపీ హయాంలో సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం





ఏలూరు (మెట్రో): రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా భావించిన గత ప్రభుత్వం అన్నదాతలు పంట పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో చిక్కుకోకూడదని రైతుభరోసా సాయం అందించి ఆదుకుంది. రైతన్న ఎవరి వద్దా చేయి చాచి అప్పులు అడిగే పరిస్థితి లేకుండా ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలోనే సొమ్ములు వారి ఖాతాల్లో జమ చేసింది. ఏటా మూడు విడతలుగా అందించిన సాయంతో రైతులు సాగును పండుగలా చేసుకున్నారు. ఎన్నికల వేళ కూటమి పార్టీలు రైతులకు రూ.20 వేల సాయం అందిస్తామంటూ ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. చంద్రబాబు హయాంలోని కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా.. నేటికీ రైతులకు ఒక్క పైసా కూడా సాయంగా అందించిన పాపాన పోలేదు. గతంలో వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబు సర్కారు.. మరోసారి అదే తీరున వ్యవహరిస్తోంది. రైతులకు ఏ విధంగానూ సహాయం చేసేందుకు ముందుకు రావడం లేదు.

కేంద్రం నిధులు విడుదల...

ఇప్పటికే తొలి విడతగా రైతులకు పీఎం కిసాన్ నిధులు రూ.2 వేలు చొప్పున అందించిన కేంద్ర ప్రభుత్వం.. శనివారం రెండో విడత సాయం విడుదల చేసింది. 1,35,230 మందికి రూ.2 వేలు చొప్పున పీఎం కిసాన్ నిధులు రూ.27 కోట్ల 4 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఒక పక్క ఖరీఫ్ ముగిసిపోతున్నా.. మరో పక్క రబీ సీజన్ ప్రారంభమవుతున్నా.. రూ.20 వేలు చొప్పున సాయం అందిస్తానన్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి నిర్ణయం ప్రకటించడం లేదు.

గత ప్రభుత్వంలో సాగుకు ముందే సాయం

గతంలో పెట్టుబడుల కోసం ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద ప్రభుత్వం రైతులకు సాయం అందించేది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6000కు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 జత చేసి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతలు, రబీ ఆరంభంలో మూడు విడతలుగా పంపిణీ చేసేది. తొలి విడతగా మే నెలలో రూ.7500 రైతుల ఖాతాలకు జమ చేసేది. ఖరీఫ్ చివర్లో పీఎం కిసాన్ రెండో విడత రూ.2000, రైతు భరోసా సాయం రెండో విడతగా రూ.2000 కలిపి రూ.4000 మొత్తాన్ని రైతుల ఖాతాలకు జమ చేసేవారు. తొలకరి పంట పెట్టుబడుల కోసం సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	ప్రభుత్వ సాయం
2019–20	2,24,016	రూ. 302.42 కోట్లు
2020–21	2,13,950	రూ. 288.83 కోట్లు
2021–22	1,90,729	రూ. 257.48 కోట్లు
2022–23	1,87,950	రూ. 253.73 కోట్లు
2023–24	1,98,179	రూ. 236.99 కోట్లు

రైతు వద్ద చిల్లిగవ్వ కూడా లేదు



రైతులకు పెట్టుబడి సాయంతో పాటు నష్టపరిహారం అందించకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. గతంలోనూ చంద్రబాబు ప్రభుత్వం రైతులను విస్మరించింది. గత రెండు దఫాలుగా కురిసిన వర్షాల వల్ల కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. ఇప్పటివరకు రూ.10 వేల ఖర్చు అవుతుంది. కానీ రెండు సార్లు నాట్లు వేయడం వల్ల సుమారు ఎకరాకు రూ.18 వేలు ఖర్చయ్యింది. రెండు కోటాల మందుతో పాటు, ఎరువులు కూడా వేయాల్సి ఉంది. తీవ్రంగా కాస్తున్న ఎండల వల్ల చేలకు ఎండు తెగులు, ఎర్ర తెగులు వ్యాపిస్తున్నాయి. దీనికి అదనంగా పురుగు మందులు వాడాలి. రైతు వద్ద పెట్టుబడులకు చిల్లిగవ్వ కూడా లేదు. ఈ విషయంపై రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– దేవరశెట్టి రాంబాబు, కౌలు రైతు, బి.కొండేపాడు

మోసం చేయడం తగదు



ఈ ఏడాది సార్వా సాగు ప్రారంభం నుంచి రైతాంగం అవస్థలు పడుతూనే ఉన్నారు. ఓ వైపు ప్రకృతి ప్రకోపానికి, మరోవైపు ప్రభుత్వం మోసానికి రైతు ఆర్థికంగా చితికిపోయాడు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సాయం చేస్తానన్న హామీని నెరవేర్చకపోవడం దారుణం. కేంద్రం ఇస్తున్న పీఎం కిసాన్ సొమ్ములకు తోడు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న మొత్తాన్ని కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రైతులను నమ్మించి మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదు.
– చినిమిల్లి వీరబాబు, సర్వోదయ రైతు సంఘం నాయకుడు, కొప్పర్రు

అన్నదాత సుఖీభవ ఎక్కడ?



ఖరీఫ్ సీజన్ ముగిసిపోతున్నప్పటికీ కూటమి సర్కారు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దారుణం. అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20 వేలు చొప్పున అందిస్తామన్న సాయంపై ఇప్పటివరకు నోరు మెదపకపోతే మేమంతా అప్పులపాలవడం ఖాయం. భవిష్యత్‌లో వ్యవసాయ రంగాన్ని కూటమి సర్కారు నిర్వీర్యం చేస్తుందనే భయం కలుగుతోంది.
– బాల చంద్రశేఖర్, పెదవేగి

నేటికీ పెదవి విప్పని సర్కారు



కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటుతున్నా కనీసం రైతన్నలను పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం రైతులపై ఆలోచన చేయకుండా దీక్షలంటూ టీడీపీ మద్దతునిచ్చిన పవన్‌కళ్యాణ్ సమయాన్ని గడుపుతున్నారే తప్ప రైతన్నలకు కనీసం మేలు చేద్దామనే ఆలోచన కూడా చేయడం లేదు. గతంలో సీజన్ ప్రారంభంలోనే ప్రభుత్వం నిధులిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేది.
– బెజవాడ నాగరాజు, ఎ.పోలవరం, జంగారెడ్డిగూడెం మండలం

అప్పులు చేసి సాగు చేస్తున్నాం



చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంట సాయం అందించకపోవడంతో సాగు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో అప్పుల బాధ వెంటాడుతోంది. సకాలంలో సాయం అందిస్తేనే రైతుకు ఉపయోగకరంగా ఉంటుంది. లేదంటే వడ్డీల భారం పెరిగిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ సాయం అందించి రైతులను ఆదుకోవాలి.
– దుగ్గిరాల త్రిమూర్తులు, ఎ.పోలవరం, జంగారెడ్డిగూడెం మండలం

ఇలాగైతే సాగుకు స్వస్తి చెప్పాల్సిందే



గోస్తనీ నది డ్రెయిన్ ముంపు కారణంగా రెండుసార్లు నారుమడులు, నాట్లు వేసి తీవ్రంగా నష్టపోయాం. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదు. ఈ ప్రభుత్వంలో కౌలు వ్యవసాయం చేయాలంటేనే భయంగా ఉంది. సబ్సిడీ విత్తనాలు కూడా మాకు అందలేదు. ఇలా ఉంటే వ్యవసాయానికి స్వస్తి చెప్పాల్సిందే.
– పెచ్చెట్టి వీరయ్య, కౌలు రైతు, సోమరాజు ఇల్లిందలపర్రు, పెనుమంట్ర మండలం

వీవోఏల తొలగింపు అన్యాయం

- వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న యానిమేటర్లు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో అక్రమంగా తొలగించిన వీవోఏలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ వేధింపుల్లో భాగంగానే వారిని అక్రమంగా తొలగించారని మండిపడ్డారు. ఎప్పటినుంచో విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలను అక్రమంగా తొలగించడం దారుణమన్నారు. అన్యాయంగా తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐదు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, వీవోఏలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా కోశాధికారి పి.ఆమని అధ్యక్షతన ఈ ధర్నా నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ విజయరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.



ధనలక్ష్మికి కరెన్సీ అలంకారం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధనలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకారం చేశారు. భీమడోలు మండలం గుండుగొలనులోని శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ఈ అలంకారం చేపట్టారు. భక్తులకు చెందిన రూ.6 లక్షల నగదుతో చేసిన అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు.
– భీమడోలు

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తం కుమార్



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తం కుమార్

చింతలపూడి: చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తం కుమార్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్‌సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో మహిళల హక్కులు, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా, దాడులు, ఆస్తి హక్కు తదితర చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవడం అందరి బాధ్యతని చెప్పారు. మహిళలకు అన్యాయం జరిగితే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత సలహాలు ఇవ్వడం కాకుండా వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. విధాన్‌సే సమాధాన్ అంటే చట్టం ద్వారా పరిష్కారం అని, చట్టం.. దాని అమలుకు ఉన్న మార్గాలను మహిళలు తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా గృహ హింస, మనోవర్తి కేసులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సబ్ జైలును సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ డి.పావని, ఐసీడీఎస్ పీఓ మాధవి, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ, సీఐ రవీంద్ర నాయక్, సబ్ జైలు సూపరింటెండెంట్ కృపానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోయేలా ఉన్నా.. పట్టించుకోని వైద్య సిబ్బంది



ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని ప్రైవేటు హాస్పిటల్ వద్ద రోడ్డుపై ఆక్సిజన్ పెట్టుకొని వైద్యం కోసం అర్థిస్తున్న బాధితురాలు నాగమణి (రాత్రి 10.35 గంటలకు)

ఏలూరు టౌన్: ప్రాణం పోయేలా ఉన్నా.. వైద్యం కోసం అర్థించినా.. నడిరోడ్డుపై ఆక్సిజన్ సిలిండర్‌తో గంటల తరబడి ఎదురుచూసినా ఆ ఆస్పత్రి యాజమాన్యం మనసు కరగలేదు.. గంటగంటకూ ఆరోగ్యం క్షీణిస్తూ రక్తపు వాంతులు చేసుకుంటున్నా కనికరించలేదు.. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద శనివారం సాయంత్రం కనిపించిన దృశ్యమిది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆస్పత్రి వద్ద రోడ్డుపైనే ఉండి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాధితురాలిని చేర్చుకునేందుకు అంగీకరించలేదు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, స్థానికులు వివరాలిలా ఉన్నాయి. కైకలూరు మండలం దేవిచింతపాడు గ్రామానికి చెందిన తానేటి నాగమణి రెండు నెలల క్రితం ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో కడుపులో కణితి ఉందని శస్త్ర చికిత్స చేయించుకుంది. ఆపరేషన్ అనంతరం ఆమె ఇంటికి వెళ్లగా కొద్ది రోజులకు తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆమెను వేరే హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా పరీక్షలు చేసిన వైద్యులు ఆమెకు క్యాన్సర్ ఉన్నట్టు తెలిపారని కుటుంబ సభ్యులు అంటున్నారు. క్యాన్సర్ కణితికి శస్త్ర చికిత్స చేయటంతో ఇన్ఫెక్షన్ అయిందని, అది తీవ్ర అనారోగ్యానికి దారితీసిందని వైద్యులు చెప్పారని వివరించారు. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలు నాగమణిని శనివారం సాయంత్రం.. ముందుగా ఆపరేషన్ చేసిన హాస్పిటల్‌కు తీసుకురాగా, తమకు సంబంధం లేదని, వైద్యం చేయబోమంటూ హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా చెప్పింది. బాధితురాలితో సుమారు ఏడు గంటల పాటు రోడ్డుపైనే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ఏలూరు జిల్లా కేంద్రంలోని వైద్య అధికారులు సైతం ఈ సంఘటనపై చర్యలేమీ తీసుకోకపోవటం గమనార్హం.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ క్వార్టర్స్‌కు ఏలూరు, నూజివీడు



వైజాగ్, ఏలూరు జట్ల మధ్య మ్యాచ్

ఏలూరు రూరల్: ఏలూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో శనివారం లీగ్ మ్యాచ్‌లు అలరించాయి. భీమవరం, విజయవాడ మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. 71–72 తేడాతో విజయవాడ గెలుపొందింది. నూజివీడు వీటీహెచ్ జట్టు ప్రతిభ చాటి 39–55 స్కోరుతో మార్టేరు జట్టును ఓడించింది. ఏలూరు జట్టుపై ఆశ్రం కళాశాల జట్టు 18–30 స్కోరుతో గెలుపొందింది. తాడేపల్లిగూడెంను 43–13 స్కోర్‌తో రామచంద్రపురం ఓడించింది. రాజమండ్రిని 53–44 స్కోర్‌తో చిత్తూరు ఓడించింది. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, సాయంత్రం ఫైనల్స్ జరుగుతాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ చెప్పారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు



నిడమర్రు స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న ముఠా సభ్యులు

నిడమర్రు: చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను అరెస్టు చేసినట్లు నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. భీమవరానికి చెందిన జువ్వల తరుణ్‌కుమార్ (యనమదుర్రు), మామిడి దుర్గారావు (బలుసుమూడి), బేత దుర్గా ప్రసాద్ (బేతనీపేట), యంత్రపాటి రవి(సుంకరపద్దయ్యగారి వీధి) ముఠాగా ఏర్పడి ఉభయగోదావరి జిల్లాలతోపాటు విశాఖపట్నం, అనకాపల్లి, గుంటూరు జిల్లాల పరిధిలో ద్విచక్రవాహనాలు, దేవాలయాల్లో హుండీలతోపాటు ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. శుక్రవారం క్రొవ్విడి గ్రామంలోని ఉప్పరగుడెం ప్రాంతంలో ఈ ముఠా ఉన్నట్లు సమాచారం తెలుసుకుని అరెస్టు చేసినట్లు సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలు, రెండు బంగారు సూత్రాలు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

గుంతలతో దినదినగండం

- ప్రాణాలు పోయేలా ఉన్నా పట్టించుకోని పాలకులు
- వాహనచోదకుల ఆవేదన

చింతలపూడి : అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులు అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపడంలేదు. దీంతో నిత్యం గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు పోతేనే కాని రోడ్లు నిర్మించరా అని ప్రయాణికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు మెట్ట ప్రాంతంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షాలకు రోడ్లపైకి నీరుచేరి మెయిన్ రోడ్డుపై అనేక ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. చింతలపూడి, గురుభట్లగూడెం రోడ్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు, చింతలపూడి సీతానగరం రోడ్డు, ఏలూరు చింతలపూడి ప్రధాన రహదారితో పాటు రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుంచి కామవరపుకోట, ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, టి.నరసాపురం రోడ్లపై పలు ప్రాంతాల్లో వర్షాలకు గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో చింతలపూడి, సీతానగరం మీదుగా వెళ్లే హైదరాబాద్ బస్సును గురుభట్లగూడెం రోడ్డు మీదుగా మళ్లించారు. అదే విధంగా సీతానగరం, పట్టాయిగూడెం, నామవరం మీదుగా ఏలూరు వెళ్లే బస్సు సైతం గతంలోనే రద్దు చేశారు. చింతలపూడి నుంచి జంగారెడ్డిగూడెం రహదారి 8 కిలో మీటర్లు మరమ్మతులు చేస్తే సరిపోతుంది. ఈ రహదారిలో ప్రయాణం ఆర్టీసీ బస్సులకు కూడా ప్రాణ సంకటంగా మారింది. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు గోతుల్లో పడి గుల్లగుల్లవుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు నుంచి కామవరపుకోట వరకు 10 కిలో మీటర్లు గోతులు తప్ప రోడ్డు కనిపించదు. ప్రధాన రహదారులకు ఇరుపక్కలా కొందరు ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్లను ఆక్రమించి మట్టి పోయడంతో రోడ్లు కోతకు గురవుతున్నాయి. వర్షపు నీరు రోడ్లపై చేరి దెబ్బతింటున్నాయి. రాత్రి సమయాల్లో గోతులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చింతలపూడి - సత్తుపల్లి ప్రధాన రహదారిలో రేచర్ల గ్రామం వద్ద ఏర్పడిన గోతులు



కామవరపుకోట మండలం నారాయణపురం వద్ద ధ్వంసమైన ఏలూరు - జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డు



కామవరపుకోట -చింతలపూడి ప్రధాన రహదారి జీలకర్రగూడెం వద్ద పరిస్థితి

నరకం చూస్తున్నాం



ప్రతి ఏటా వర్షా కాలంలో రోడ్లు రొచ్చు, రొచ్చుగా తయారవుతున్నాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్లు అభివద్ధి చేయాలి.

– తొర్లపాటి బాబు, చింతలపూడి

ఈ రోడ్లెక్కితే యమపురికే!

భీమడోలు : ఏలూరు జిల్లాలో గత మూడు నెలలుగా కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ద్విచక్రవాహనదారులకు గుంతల రోడ్లు చుక్కలు చూపిస్తున్నాయి. ఆదమరిస్తే గోతుల్లో పడి గాయాల పాలవడమో లేక ప్రాణాలు పోవడం ఖాయం. కళ్ల ముందు పెద్ద పెద్ద గుంతలతో రోడ్లు కనిపిస్తున్నా అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదు. భీమడోలు మండలంలోని వివిధ శాఖలకు చెందిన ప్రధాన రోడ్లు దారుణంగా మారడంతో రోజూ ఈ రోడ్లపై ప్రయాణించే రైతులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు నరకాన్ని చవి చూస్తున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఆర్ అండ్ బీ రోడ్డులో అడుగుకో గొయ్యి పడింది. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు మూడు కిలోమీటర్ల రోడ్డును దాటాలంటే భయపడుతున్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎం పురం నుంచి సాయన్నపాలెం వరకు 6 కిలోమీటర్ల రోడ్డు అడుగుకో గుంతలా మారింది. ఆ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే బైక్‌తో కుస్తీ పట్టాల్సిందే. ఆదమరిస్తే పక్కనే ఉన్న పంట పొలాల్లో గానీ, డ్రైనేజ్‌లో గానీ పడిపోవడం ఖాయం. భీమడోలు కోమటిగుంట రోడ్డు గోతులతో నిండిపోయింది. సూరప్పగూడెం, కంద్రిగ, మలకచర్ల తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు నుంచి భీమడోలు రావాలంటే అవస్థలు పడుతున్నారు. కొల్లేరులోని చెట్టున్నపాడు నుంచి మల్లవరం వరకు రోడ్డు దెబ్బతింది. వివిధ గ్రామాలకు ఈ రహదారి వెంటే వెళ్లాలి. రోడ్లన్నీ ఇలా ఉంటే రాకపోకలు ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



భీమడోలు జంక్షన్ నుంచి గేటు రోడ్డుపై ప్రాణ సంకటంగా గోతులు



భీమడోలులో గోతులతో నిండిన కోమటిగుంట రోడ్డు



కొల్లేరులోని చెట్టున్నపాడు నుంచి మల్లవరం రోడ్డుపై ప్రయాణం నరకమే

పచ్చనేతల అండదండలతో..

- ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు
- ఎమ్మెల్యే కామినేని పేరుచెప్పి అధికారులకు బెదిరింపు

కైకలూరు : కైకలూరు – ఏలూరు రోడ్డులో మండవల్లి మండలం చింతపాడు పంచాయతీ పరిధి దయ్యంపాడు వద్ద రీ సర్వే 68లో అర్అండ్‌బీకి సంబంధించిన ఎకరం 3.42 సెంట్లలో టీడీపీ నేత ముంగర ఏడుకొండలు అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడు. నోటీసులిచ్చినా కూటమి నేతల అండదండలతో అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు పాల్పడగా.. జేసీబీతో కొంతమేర ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. జూలై 10న పంచాయతీ సెక్రటరీ టి.శ్రీనివాస్ నోటీసులు ఇచ్చారు. అప్పటికీ నిర్మాణాలు ఆపలేదు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై జూలై 18న ఈఓపీఆర్డీ, పంచాయతీ సెక్రటరీలు డీపీవోకు నివేదిక ఇచ్చారు. అయినప్పటికీ లెక్క చేయకుండా ఆక్రమణదారుడు ప్రస్తుతం 3.42 సెంట్లలో నిర్మాణం చేస్తున్నాడు. దీంతో ఈ నెల 3న వీఆర్వో, ఆర్అండ్‌బీ అధికారులు అడ్డుకున్నారు. ఇప్పుడు మళ్లీ పనులు చేపట్టాడు. చివరికి శనివారం చింతపాడు పంచాయతీ సెక్రటరీ ప్రభాకరరావు మరోసారి పంచాయతీ నుంచి నోటీసులు అందించారు.

కూటమి నేతల అండదండలతో..

కూటమి నేతలతో ఆక్రమణదారుడు సాన్నిహిత్యం పెంచుకున్నాడు. కలెక్టర్ దగ్గరకు వెళ్ళాలన్నా, ఎమ్మెల్యే కామినేని కార్యక్రమాల్లోనూ ఇతను తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే అక్రమ నిర్మాణం దగ్గరకు అధికారులు వస్తే ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేరు చెప్పి బెదిరిస్తున్నాడు. వాస్తవానికి ఇది ఆర్అండ్‌బీ మార్జిన్‌కు సంబంధించిన భూమి. పైగా కైకలూరు–ఏలూరు రహదారిలో రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణం కనిపిస్తోంది. ఇంత దర్జాగా కబ్జా చేస్తున్నా అధికారులను లెక్కచేయకుండా నియంతలా వ్యవహరిస్తున్నా కబ్జాదారునిపై ప్రభుత్వం చర్యలు తీసుకోపోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వానికి చెందిన భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేయడం వాస్తవమేనని చింతపాడు వీఆర్వో యువరాజు చెప్పారు. అనేక సందర్భాల్లో ఇది తప్పని ఆక్రమణదారుడికి చెప్పామన్నారు. పంచాయతీ నుంచి నోటీసులు కూడా అందించామని.. సెలవు రోజుల్లో పనులు చేపడుతున్నారని గుర్తించామన్నారు. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు.



ఈ ఏడాది మార్చి 18న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు (ఫైల్)



శనివారం ఆక్రమణదారుడికి మూడోసారి నోటీసు అందిస్తున్న అధికారులు

పంచాయతీ బోర్డు శిలాఫలకం ధ్వంసం

దెందులూరు: దెందులూరు మండలం కంద్రిక నరసింహపురం సచివాలయం బోర్డు శిలాఫలకాన్ని శనివారం దుండగులు ధ్వంసం చేసారు. గ్రామ సర్పంచ్ మెండెం సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి ముకుంద వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దిరాజు, నాయకులు హరీష్, రవి, మహేష్, గ్రామస్తులు ఈ సంఘటనను ఖండించారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి ఈ విషయాన్ని తెలిపారు.



ధ్వంసం చేసిన శిలాఫలకం

గుట్టలు.. గుట్టుగా మాయం

కుక్కునూరు: పర్యావరణానికి, వన సంపదకు కేంద్రాలుగా ఉన్న గుట్టలను హరిస్తూ కొందరు అక్రమార్కులు అడ్డగోలుగా పట్టపగలే దోచేస్తున్నారు. ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ రాజకీయ పలుకుబడితో పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీంతో కుక్కునూరు మండలంలోని గుండేటి వాగు, ఎర్రబోరు, ఇబ్రహీంపేట, వేలేరు తదితర ప్రాంతాలలో గ్రావెల్ గుట్టలు కనుమరుగయ్యే స్థితికి చేరుకున్నాయి.

అడ్డూఅదుపు లేకుండా తవ్వకాలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మండలంలో ఏదో మూల గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని, గుట్టల్లోని మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అదేంటని అడిగితే.. మండలాన్ని దాటిస్తున్నామా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. స్థానిక అవసరాల కోసమే మట్టిని వాడుతున్నామని చెబుతున్నారు.

తరిగిపోతున్న గుట్టలు

అక్రమార్కుల స్వార్థంతో ప్రభుత్వ భూముల్లోని గుట్టలు తరిగిపోతున్నాయి. ఇలానే కొనసాగితే గుట్టలు మాయమవడం ఖాయం. దీంతో పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాల విషయమై సంబంధిత అధికారులకు సమాచారాన్ని ఇచ్చినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో అధికారుల అండతోనే మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టి ప్రభుత్వ సంపదను కాపాడాలని కోరుతున్నారు.



గ్రావెల్ తవ్వకాలతో కనుమరుగవుతున్న గుండేటివాగు సమీపంలోని ముగ్గు గుట్ట



ట్రాక్టర్‌లో గ్రావెల్‌ను తరలిస్తున్న అక్రమార్కులు

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ ఆవేదన

ఏలూరు టౌన్: ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, పూర్తిగా ఫీజు చెల్లించినా సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ మనస్తాపానికి గురైన ఒక విద్యార్థి కాలేజీ ప్రాంగణంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని ఏలూరు జీజీహెచ్‌కు చేర్పించగా.. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. నగర శివారు వట్లూరుకు చెందిన చేబోయిన అచ్యుత్ ఏలూరు ఎన్ఆర్‌పేటలోని ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కాలేజీకి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవి జూనియర్ కాలేజీలో గత ఏడాది ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించాడు. సర్టిఫికెట్ల కోసం అనేక సార్లు కళాశాలకు వెళ్లినా ప్రిన్సిపల్ మురళీ ఇవ్వకుండా తిప్పుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. మొత్తం ఫీజులన్నీ కట్టేసినా... ఇంకా కట్టాలని వేధించారంటూ అతను ఆరోపించాడు. హిమాచల్ ప్రదేశ్‌లో కౌన్సెలింగ్‌కు వెళ్లాల్సి ఉండగా.. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. తీవ్ర మనస్థాపంతో అచ్యుత్ కళాశాల ప్రాంగణంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



విద్యార్థిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు

విద్యార్థి నేతల ఆందోళన

అచ్యుత్‌కు జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఆధ్వర్యంలో విద్యార్థి నేతలు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. కళాశాల ముందు బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కాలేజీ వద్దకు వెళ్ళి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. కాకి నాని, శివరావు మాట్లాడుతూ... ఎస్‌వీఆర్‌కే కళాశాల యాజమాన్య తీరు సరిగా లేదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారంటూ మండిపడ్డారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారు ఢీకొని మహిళ మృతి

ఉంగుటూరు: నారాయణపురంలో కారు ఢీకొని సంకు ధనలక్ష్మి (57) మృతిచెందింది. కారు పార్కింగ్ చేస్తున్న సమయంలో కారు నడిపే వ్యక్తి అజాగ్రత్తగా బ్రేక్‌కు బదులు ఎక్సలేటర్ నొక్కడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెదనింద్రకొలనుకు చెందిన నడివింటి వెంకటేశ్వరరావు నారాయణపురంలో ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. కింది పోర్షన్‌లో మృతురాలి చెల్లెలు కుమారి అద్దెకు ఉంటుంది. పక్కింట్లోనే ఉంటున్న అక్క ధనలక్ష్మి.. కుమారితో ఇంటి బయట మాట్లాడుతుండగా వెంకటేశ్వరరావు కారు పార్కింగ్ చేస్తూ అజాగ్రత్తగా ధనలక్ష్మిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై ఎస్సై సూర్య భగవాన్ మాట్లాడుతూ.. ఈ ప్రమాదం ఘటన తెలిసిందని, అయితే ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.